ప్రజాశక్తి
సోమవారం 1 సెప్టెంబర్ 2025 5 అనంతపురం

పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

కార్మిక సంక్షేమ శాఖ కార్యాలయ ముట్టడిని జయప్రదం చేయండి

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సెప్టెంబర్ 15వ తేదీన కార్మిక సంక్షేమ శాఖ జిల్లా కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం నాగమణి, ఎస్ నాగేంద్ర కుమార్, భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి టి రామాంజనేయులు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక గణనాయక భవన్‌లో భవనిర్మాణ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ధర్నా పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తలపెట్టిన రాష్ట్ర లేబర్ కమిషనర్ ఆఫీస్ ముట్టడి కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలన్నారు. టిడిపి తన ఎన్నికల మ్యానిఫెస్టోలో భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన వాగ్దానం ప్రకారం బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు అమలు చెయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 25 లక్షలకు పైగా భవన నిర్మాణ కార్మికులకు నిర్మాణ రంగంలో ఉపాధి పొందుతూ 18 లక్షలకు పైగా రాష్ట్ర బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డులో తమ పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. అనేక రాష్ట్రాల్లో భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలవుతున్నాయనిమన రాష్ట్రంలో కూడా ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు నుంచి వివిధ సంక్షేమ పథకాలు బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు ద్వారా అమలయ్యేవని చెప్పారు. రాష్ట్రం విడిపోయిన తరువాత కూడా కొన్ని సంవత్సరాలు సంక్షేమ పథకాలు అమలు జరిపారన్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో రాష్ట్ర బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాలను ఆపివేస్తూ మెమో 1214 జారీ చేసిందన్నారు. రాష్ట్ర బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డులో వేల కోట్ల రూపాయలు కార్మిక సంక్షేమ నిధులు ఉన్నప్పటికీ వైసిపి తీసుకున్న నిర్ణయం కారణంగా సంక్షేమ పథకాలు ఆగిపోయాయని విమర్శించారు. దేశంలోని ఇతర రాష్ట్రాల్లో ఇప్పటికే అమలవుతున్న సంక్షేమ పథకాలకు అదనంగా ఈ కాలంలో అనేక కొత్త సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నారన్నారు. కర్నాటక రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికుల కుటుంబాల్లోని చదువుకునే పిల్లలకు స్కాలర్‌షిప్‌లు అమలు చేస్తున్నారన్నారు. అదే విధంగా తమిళనాడు రాష్ట్రంలో 2025 వ సంవత్సరం జూలై నుండి ప్రమాదవశాత్తు చనిపోయిన భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలకి 10లక్షల రూపాయలు నష్టపరిహారం చెల్లిస్తున్నారన్నారు. హర్యానా రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికుల కుటుంబాల్లోని మహిళలకు ఆర్థిక స్వావలంభన సాధించే దిశగా కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్నారని చెప్పారు. దేశంలోని చాలా రాష్ట్రాల బిల్డింగ్ వర్కర్స్, వెల్ఫేర్ బోర్డులో నిధులు తక్కువగా ఉన్న సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. ఇతర రాష్ట్రాల్లో మాదిరిగానే ఆంధ్రప్రదేశ్‌లో కూడా సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ప్రసాద్, ఉపాధ్యక్షులు నాగరత్నమ్మ, జిల్లా కమిటీ సభ్యులు హనుమంత్ రెడ్డి, కంబగిరి దస్తగిరి, కమిటీ సభ్యులు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు

'ప్రత్యామ్నాయం'పై నిర్లక్ష్యం



పెనుకొండ వద్ద దుక్కి చేసి బీడుగా ఉన్న పొలం

- విస్తారమైన వర్షాలతో ప్రత్యామ్నాయ సాగుకు సన్నద్ధం
- సబ్సిడీ విత్తనాల కోసం రైతుల ఎదురుచూపు
- అందని సబ్సిడీ విత్తనాలు
- ఆందోళనలో అన్నదాతలు

జిల్లా వ్యాప్తంగా ఇటీవల విస్తారంగా వర్షాలు కురిసాయి. దీంతో ఖరీఫ్ వేరుశనగ, ఇతర పంటలు సాగు చేయలేని రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేందుకు సిద్ధమయ్యారు. ప్రత్యామ్నాయ పంటల విత్తనాలు పంపిణీపై ప్రభుత్వం దృష్టి సారించకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఈ ఏడాది ఖరీఫ్ లో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఆశించిన స్థాయిలో పంటలు సాగు కాలేదు. దీంతో రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుకు మొగ్గు చూపుతున్నారు. రైతన్నకు అవసరమైన విత్తనాలు అందించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది.

ప్రజాశక్తి-పెనుకొండ

ఉమ్మడి జిల్లాలో వర్షాభావం కారణంగా పంటల సాగు తగ్గుతూ వస్తోంది. ఖరీఫ్ లో వేరుశనగ పంట సాగుకు వర్షం కోసం ఎదురుచూసినా పడక పోవడంతో సాగుచేయలేదు. ఇటీవల విస్తారంగా జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురవడంతో ప్రత్యామ్నాయ పంటల సాగుకు సిద్ధమయ్యారు. నేటికీ రైతులకు విత్తనాలు అందుబాటులోకి రాలేదు. శ్రీసత్యసాయి జిల్లాలో వ్యవసాయశాఖ అధికారులు 60 వేల హెక్టార్లలో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేందుకు 15వేల క్వింటాళ్ల విత్తనాలు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. అయితే నేటికీ ప్రత్యామ్నాయ విత్తనాలు రాలేదు. కొంత మంది రైతులు బయట మార్కెట్లో విత్తనాలు కొనుగోలు చేసి పంట సాగు చేస్తున్నారు. గత ఏడాది వేరుశనగ పంట దెబ్బతినడంతో ఈఏడు పంట సాగు చేసి అప్పుల ఊబినుంచి బయటపడదామని ఆశించిన రైతులకు నిరాశ ఎదురైంది. ఖరీఫ్ ప్రారంభంలో వర్షాలు పడడంతో అధిక వడ్డీకి అప్పులు తెచ్చి వేరుశనగ పంట సాగు కోసం పొలాలను దున్ని దుక్కులు చేసు కుని ఎరువులు, విత్తనాలు అన్ని సమకూర్చుకున్నారు. అయితే వర్షం రాకపోవటంతో తాము పంటసాగు చేయకనే నష్టపోవాల్సి వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆగస్టు మొదటివారంలో వర్షాలు పడడంతో కొంత మంది రైతులు వేరుశనగ పంటపై ఆశ చావక వేరుశనగను సాగు చేశారు. కొంత మంది రైతులు మాత్రం ప్రత్యామ్నాయ పంటల సాగుకు సన్నద్ధం అవుతున్నారు. దీంతో గతంకంటే సాగు విస్తీర్ణం బాగా తగ్గింది.

జిల్లాలో వేరుశనగ సాగు ఇలా..

జిల్లాలో మొత్తం సాగు విస్తీర్ణం 2,69,167 హెక్టార్లుఉంది. ఇప్పటి వరకు 42వేల హెక్టార్లలో వివిధ పంటలు సాగు చేశారు. వేరుశనగ సాధారణ సాగు విస్తీర్ణం 1,51,824 హెక్టార్లకు గాను ఇప్పటిదాకా 15,897 హెక్టార్లలో సాగైంది. కదిరి డివిజన్లో 96,818 హెక్టార్లు, ధర్మవరం 70,910, మడకశిర 24,015, పెనుకొండ 20,010, హిందూపురం 5,571 హెక్టార్లలో సాగు కావాల్సి ఉంది.

జిల్లా లో80వేల హెక్టార్లలో పంటల సాగు..

వర్షాభావం కారణంగా ఖరీఫ్లో జిల్లాలో 2,69,167 లక్షల హెక్టార్లకుగాను అన్నిరకాల పంటలు కలిపి 80 వేల హెక్టార్లలోనే సాగయ్యాయి. ఇందులో 42వేల హెక్టార్లలోనే వేరుశనగ, మిగతా విస్తీర్ణంలో కంది, మొక్కజొన్న, వరి తదితర పంటలు సాగు చేశారు. గత ఏడాది కంటే ఈ ఏడాది ఖరీఫ్ లో సాగు విస్తీర్ణం తగ్గిందని అధికారులు అంటున్నారు. అలసంద, ఉలవ, పెసర, జొన్న పంటలు సాగు చేసేందుకు 4,500 క్వింటాళ్ల విత్తనాలకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు.

సబ్సిడీ విత్తనాల కోసం ఎదురు చూస్తున్నాం

నాకు 5 ఎకరాల పొలం ఉంది. గతేడాది వర్షాభావం కారణంగా వేరుశనగ పంట దెబ్బతింది. దీంతో నష్టపోయా. ఈఏడాది వేరుశనన సాగు చేసి అప్పులు ఊబిలో నుంచి బయటపడదామని ఆశించి వేరుశనగ సాగుకు పొలాన్ని సిద్ధం చేసుకుంటే వర్షం కురవలేదు. ఆగస్టు నెలలో వర్షాలు పడ్డాయి. దీంతో ప్రత్యామ్నాయ పంటను సాగు చేద్దామనుకున్నా. విత్తనాలు అందుబాటులోకి రాలేదు. దీంతో బయట మార్కెట్ లో మొక్కజొన్న కొనుగోలు చేసి రెండెకరాల్లో పంట సాగు చేశా. రూ.20వేలు ఖర్చయ్యింది. ప్రభుత్వం ప్రత్యా మ్నాయ విత్తనాలు సరఫరా చేసి ఉంటే ఇంత ఖర్చు అయ్యేది కాదు.

నంజప్ప రైతు ,
అడదాకుల పల్లి

ఉచితంగా విత్తనాలు పంపిణీ చేయాలి

వర్షాభావ పరిస్థితులతో చాలా మంది రైతులు ప్రధాన పంటలు సాగు చేయలేకపోయారు. ఆగస్టులో వర్షం పడటంతో ప్రత్యా మ్నాయ పంటలు సాగు చేసేందుకు రైతులు అసక్తి చూపుతున్నారు. ప్రత్యా మ్నాయ పంటల సాగుకు అనుకూలమైన సమయం ఇదే. దీన్ని దృష్టిలో ఉంచుకొని తక్షణమే ప్రత్యామ్నాయ విత్తనాలు పంపిణీ చేయాలి. ఒక్కో రైతుకు ఐదు ఎకరాల వరకూ ఉచితంగా ప్రత్యామ్నాయ విత్తనాలు పంపిణీ చేయాలి.

హరి,
ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు

నెల క్రితమే ప్రతిపాదనలు పంపాం

జిల్లాలో 60వేల హెక్టార్లలో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేందుకు 15వేల క్వింటాల్ల ఉలవలు, పెసలు, అలసంద, జొన్న విత్తనాలు అవసరం అవుతాయి. నెల క్రితమే ప్రభుత్వానికి ప్రతి పాదనలు పంపాం. ప్రత్యామ్నాయ విత్తనాలు వచ్చిన వెంటనే రైతులకు పంపిణీ చేస్తాం.

వైవి. సుబ్బారావు,
జిల్లా వ్యవసాయశాఖ అధికారి

పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యం

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-నార్పల

నియోజకవర్గంలో రేసులు నిర్వహించడం తమ ఉద్దేశం కాదని.. పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలో ఇటీవల మూడు రోజులపాటు నిర్వహించిన కారు, బైకు రేసులపై ఆమె స్పందించారు. మోటార్ స్పోర్ట్స్ ఆర్గనైజర్స్ గతంలో కుప్పంలో నిర్వహించిన ఇలాంటి కార్యక్రమం విజయవంతంగా సాగిందన్నారు. ఆ విజయంతో అక్కడ 50 ఎకరాల స్థలం పర్యాటక అభివృద్ధికి కేటాయించినట్లు తెలిపారు. తాము చేసే ప్రతిపనీ ప్రజలు, నియోజకవర్గ అభివృద్ధి కోసమే అన్నారు. ఇటీవల నార్పల, శింగనమల ప్రాంతాల్లో జరిగిన స్పోర్ట్స్ కార్లు, బైక్‌లు ప్రజల్లో విశేష ఆకర్షణ కలిగించాయన్నారు. యువత వీక్షించడానికి పెద్ద ఎత్తున తరలివచ్చారన్నారు. అయితే కొన్ని గ్రామాల ప్రజలు వ్యక్తం చేసిన ఆందోళనలను తాము గౌరవిస్తామన్నారు. రేస్ నిర్వహణలో అన్ని అధికార అనుమతులు, మెడికల్ డాక్టర్లు అందుబాటులో ఉంచడం, వేగ నియంత్రణ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన మోటార్ స్పోర్ట్స్ సంస్థ సురక్షితంగా ఈవెంట్‌ను నిర్వహించిందన్నారు. ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణ తమకు అత్యంత ప్రాధాన్యమన్నారు. భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలు సమాజానికి ఎలాంటి హాని కలగకుండా, కేవలం పర్యాటక ఆకర్షణల రూపంలో, సురక్షిత వాతావరణంలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు.

తాడిపత్రిలో ఉద్రిక్తత

వినాయక విగ్రహ నిమజ్జనం సందర్భంగా ఘర్షణ

రాళ్లు, కట్టెలతో కొట్టుకున్న ఇరువర్గాలు

ప్రజాశక్తి - తాడిపత్రి

వినాయక విగ్రహాల నిమజ్జనం సందర్భంగా తాడిపత్రిలో ఆదివారం ఉద్రిక్తత చోటు చేసుకుంది. విగ్రహాల ఊరేగింపు సందర్భంగా ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఈసందర్భంగా ఇరువర్గాల వారు రాళ్లు, కట్టెలతో దాడులు చేసుకున్నారు. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి పరిస్థితిని చక్కదిద్దారు.

తాడిపత్రి పట్టణంలో పెద్దఎత్తును ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాలను ఆదివారం అట్టహాసంగా నిమజ్జన కార్యక్రమాన్ని తలపెట్టారు. తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాల మధ్య చేపట్టిన వినాయక విగ్రహా నిమజ్జనం ఉరేగింపు వెనుకగా మిగిలిన విగ్రహాల ఊరేగింపు కొనసాగింది. ఈసందర్భంగా పట్టణానికి చెందిన కాకర్ల రంగనాథ వర్గానికి చెందిన వినాయక విగ్రహ ఊరేగింపు ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో కాకర్ల రంఘనాథ వర్గం వారు తమ విగ్రహాన్ని జేసీ వర్గం చేపట్టిన విగ్రహ ఊరేగింపు వెనుక వెళ్లడానికి నిరాకరించి తమ ఊరేగింపును వైఎస్ఆర్ సర్కిల్ వద్ద నిలుపుదల చేశారు. దీంతో విగ్రహాల ఊరేగింపునకు అంతరాయం ఏర్పడటంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ఆలోపే జేసీ వర్గీయులు, కాకర్ల రంగనాథ వర్గీయులు ఒకరిపై ఒకరు కేకలు వేసుకుంటూ గుమికూడారు. రాళ్లతో, కట్టెలతో దాడులు చేసుకున్నారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. జేసీ వర్గీయులు కాకర్ల రంగనాథ వర్గీయులు ఊరేగింపు ముందు ఉన్న డీజే వాహనం అద్దాలను పగులకొట్టారు. దీంతో పెద్దఎత్తున పోలీసులు మొహరించి పరిస్థితిని చక్కదిద్దారు. కాకర్ల రంగనాథ వర్గానికి చెందిన వినాయక విగ్రహ ఊరేగింపు వాహనాన్ని పోలీసులు స్వయంగా నడుపుకుంటూ శింగనమల చెరువులో నిమజ్జనం చేసే విధంగా తరలించారు. ఈ ఘటనతో పట్టణంలో వినాయక విగ్రహాల నిమజ్జన ఊరేగింపునకు అంతరాయం ఏర్పడింది. ఇరువర్గాల వారిని పోలీసులు పంపించడంతో ఆయా కాలనీల్లో ఉంచిన వినాయక విగ్రహాల ఊరేగింపు వాహనాలు రోడ్డుపైకి వచ్చాయి. అనంతరం వినాయక విగ్రహాల శోభాయాత్రను డప్పుల సందడి మధ్య కొనసాగింది.

ఆందోళన కారులను చెదరగొడుతున్న పోలీసులు(ఇన్‌సెట్‌లో పగిలిన వాహనం అద్దాలు)

గిరిజనులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి కె.మోహన్‌రామ్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

స్వాతంత్య్రం సిద్ధించి 75 ఏళ్లు దాటుతున్నా ఇంకా కొన్ని మారుమూల గిరిజన గ్రామాలు సరైన మౌలిక సదుపాయాలకు నోచుకోలేదు. ప్రధానంగా రహదారులు, తాగునీరు, విద్యుత్, రవాణా సౌకర్యం తదితర మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్న గిరిజన తండాలు, ఎరుకుల, యానాది తదితర వెనుకబడిన గిరిజన ఆవాసాలు ఉన్నాయి. గిరిజన ఆవాసాల అభివద్ధికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా కోట్లాది రూపాయల నిధులు ఖర్చు చేస్తున్నాయి. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికంగా కూడా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా గిరిజనులు వారి పిల్లలు పథకాలను అందిపుచ్చుకొని అభివృద్ధి చెందాల్సి ఉంది. ఈ నేపథ్యంలో జిల్లాలో గిరిజన సంక్షేమ శాఖ ద్వారా అందిస్తున్న పథకాలు గురించి జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కె. మోహన్ రామ్ ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖి ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు అంశాలను వివరించారు.

జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కె. మోహన్ రామ్

ప్రశ్న: జిల్లాలో ఎన్ని గిరిజన ఆవాస గ్రామాలున్నాయి.? అందులో అత్యంత వెనుకబడినవి ఎన్ని?

జవాబు: జిల్లా వ్యాప్తంగా 450 గిరిజన ఆవాస గ్రామాలు ఉన్నాయి. ఇందులో ఏడు గ్రామాల్లో మౌలిక సదుపాయాలు లేనట్లుగా గుర్తించాం. రహదారులు, నీటి సదుపాయాలు, కల్పించడానికి తగు చర్యలు తీసుకుంటున్నాము.

ప్ర: గిరిజనులకు కల్పిస్తున్న రుణ సదుపాయాలేవి ?

జ: గిరిజనుల అభివృద్ధి కోసం 60 యూనిట్లు గుర్తించాం. వాటిలో గొర్రెలు, పాడి పశువులు, ట్రాక్టర్లు, బొలెరా వాహనాలు, వీటిని అందించడానికి చర్యలు తీసుకుంటున్నాం. గిరిజన పాఠశాలల అభివృద్ధికి తగిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి నివేదించాం.

ప్ర: గిరిజన విద్యార్థులు ఎంతమంది ఉన్నారు.? వారికి ప్రత్యేక పాఠశాలలు ఎన్ని ఉన్నాయి.?

జ : జిల్లాలో దాదాపు 1900 మంది గిరిజన విద్యార్థులు ఉన్నారు. వారికోసం ప్రత్యేక పాఠశాలలు ఉన్నాయి. ఒక ఆశ్రమ పాఠశాల, ఆరు గురుకుల పాఠశాలలు, ఐదు వసతిగృహాలు ఉన్నాయి. వాటిలో మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతోంది.

ప్ర: సమగ్ర గిరిజన గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వపరంగా తీసుకుంటున్న చర్యలు ఏమిటి.?

జ : సమగ్ర గిరిజన అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం జిల్లాలో 3 గ్రామాలను ఎంపిక చేసింది. మారుమూల గ్రామాలైన వాటిలో పూర్తిగా మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యం. సోమందేపల్లి మండలం నాగినాయుని చెరువు తండా, తనకల్లు మండలంలో ముండ్ల వారి పల్లి, గాండ్లపెంట మండలంలో తుమ్మల జైలు గ్రామాలు ఎంపికయ్యాయి. వీటిని అన్ని రకాలుగా అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దడమే ధ్యేయం. అందుకు కేంద్ర ప్రభుత్వం తగిన నిధులు మంజూరు చేయనుంది. వాటితో గృహ నిర్మాణం, తాగునీటి సౌకర్యం, రహదారులు, విద్య వైద్య సౌకర్యాలు ఇలా 17 రకాల అభివృద్ధి పనులు, మౌలిక సౌకర్యాలు కల్పిస్తాం.

ప్ర మీశాఖలో సిబ్బంది కొరత ఉందా.? గిరిజనులకు మీరు ఇచ్చే సలహాలు ఏమిటీ.?

జ : సిబ్బంది కొరత ఏమీ లేదు. అభివృద్ధి పనులు ఆయా శాఖల పర్యవేక్షణలో జరుగుతాయి. తమ శాఖ ఆయా గిరిజన గ్రామాల్లో ఉన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళుతుంది. గతంతో పోల్చుకుంటే గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయి. మారుతున్న సమాజానికి అనుగుణంగా అవసరాలు కూడా పెరుగుతుంటాయి. గిరిజనులు తమ పిల్లలను బాగా చదివించుకోవాలి. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను అందుకొని వాటిని సద్వినియోగం చేసుకొని మరింత అభివద్ధి చెందాలి.

దుండగుల చేతిలో ధ్వంసమైన ట్రాన్స్‌ఫారం (పాతచిత్రం)

వ్యవసాయ పొలాల్లో వరుస చోరీలు

వ్యవసాయ పరికరాలను ఎత్తుకెళ్తున్న దుండగులు

బెంబేలెత్తుతున్న రైతులు

పజాశక్తి-యల్లనూరు

మండలంలోని వ్యవసాయ పొలాల్లో జరుగుతున్న వరుస చోరీలతో రైతులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటిదాకా మండలంలోనిరైతుల తోటల్లో సుమారు రూ.5లక్షల వరకూ వ్యవసాయ పరికరాలో చోరీకి గురైనట్లు తెలుస్తోంది. వారం క్రితం యల్లనూరు చెరువు కట్ట సమీపంలో ఉన్న రైతు రాజశేఖర్ పొలంలో పివిసి పైపులు, ఓపెన్ సబ్ మోటార్, కేబుల్ వైరు చోరీకి గురైంది. అలాగే గరుగు పొలాల్లో రైతు శేఖర్‌రెడ్డికి చెందిన బంతి కేబుల్, మోటార్ కేబుల్ వైరు చోరీ జరిగింది. గత గురువారం రాత్రి కూడా ఇదే రాజశేఖర్ కౌలుకు చేస్తున్న పొలంలోని బంతి కేబుల్ స్టాటర్, మోటార్ కేబుల్ వైరు చోరీ జరిగింది. ఇలా వరుస చోరీలు జరుగుతుండటంతో కంటి మీద కునుకు లేకుండా పోతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. చోరీలపై పోలీసులకు ఫిర్యాదు చేస్తుంటే తోటల్లో సీసీ కెమెరాలు అమర్చుకోవాలని ఉచిత సలహా ఇస్తున్నట్లు బాధిత రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా పోలీసులు ప్రత్యేక చొరవ తీసుకుని చోరీలకు అడ్డుకట్ట వేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ధ్వంసమైన మోటారు (పాతచిత్రం)

ప్రజాశక్తి
www.prajasakti.com

భ(ర)క్షక భటులు..!

బాధితులను పీడిస్తున్న పోలీసులు- ఆందోళనలో ఫిర్యాదుదారులు

ప్రజాశక్తి-పుట్లూరు

మండల కేంద్రంలోని రక్షక భటుల నిలయం భక్షకభటుల నిలయంగా మారిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎవరైనా బాధితులు న్యాయం కోసం పోలీస్‌స్టేషన్‌కు వెళ్తే పీల్చిపిప్పి చేస్తున్నట్లు సమాచారం. ఫిర్యాదు చేస్తే చాలు వేలకు వేలు వసూలు చేస్తున్నట్లు బాధితులు వాపోతున్నారు. చిన్న కేసు అయినా కనీసం రూ.5వేల నుంచి కప్పం కట్టాల్సిందే అని చెబుతున్నారు. అంతేకాకుండా రికవరీల పేరుతో భారీగా వసూళ్లు చేసి అరకొరక రికవరీ చూపిస్తున్నట్లు సమాచారం. దీంతో సొమ్ము పోగొట్టుకున్న వారు తీవ్రంగా నష్టపోవడంతోపాటు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదేమని అడిగితే 'ఇచ్చింది తీసుకో..' అని హుకుం జారీ చేస్తున్నట్లు బాధితులు ఆందోళన చెందుతున్నారు. రెండు నెలల క్రితం ఓ చోరీ కేసులో రూ.ఐదు లక్షలపైగానే రికవరీ చేసినా కేవలం రూ.మూడు లక్షలు మాత్రమే అధికారికంగా చూపించినట్లు సమాచారం. అలాగే మండల పరిధిలోని ఓ గ్రామంలో గొడవ పడి స్టేషన్‌కు వస్తే ఒక్కొక్క గ్రూపుతో ఒక్కొక్కసారి రూ.10 నుంచి రూ.15వేల వరకూ రెండుసార్లు రెండు గ్రూపులతో వసూలు చేసినట్లు తెలుస్తోంది. రెండు వారాల క్రితం మండల కేంద్రంలోని ఓ దుకాణంలో దొంగలు పడి రూ.15వేలకుపైన నగదు దోచుకెళ్లారు. కానీ రికవరీలో మాత్రం 7450 మాత్రమే చూపించినట్లు సమాచారం. ఇదేమని ఓ కానిస్టేబుల్‌ను అడగ్గా చోరీ చేసిన వాడు వ్యసానాలకు అలవాటు పడి డబ్బు ఖర్చు పెట్టాడని, రికవరీ అయింది ఇందే.. ఇంకేం చేయలేం అని చెప్పడి గమనార్హం. వీటితోపాటు మూడు నెలల క్రితం దొంగతనం చేసిన వారితో రికవరీ చేయాల్సింది పోయి.. వారితోనే డబ్బులు వసూలు చేసి స్టేషన్ బెయిల్ ఇచ్చి వదిలి పెట్టారంటే పోలీస్‌స్టేషన్‌లో పోలీసులు ఎలాంటి లంచావతారం ఎత్తారనే విషయం స్పష్టంగా అర్థమవుతోంది. ఇవేకాకుండా బెల్టు షాపుల నిర్వాహకులతో నెలనెలా మామూళ్లు వసూలు చేస్తున్నట్లు సమాచారం. వసూళ్లకు పాల్పడటమే కాకుండా మీకు మేము అండగా ఉంటాం.. అని భరోసా ఇస్తుండటంతో బెల్ట్‌షాప్‌ల నిర్వాహకులు రెచ్చిపోతున్నట్లు తెలుస్తోంది. దీంతో కొన్ని గ్రామాల్లో గొడవలు జరిగిన దాఖలాలు ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పుట్లూరు పోలీస్‌స్టేషన్ సిబ్బందిపై నిఘా ఉంచి బాధితులకు న్యాయం చేయాలని మండలవాసులు కోరుతున్నారు.

నాగార్జునను సన్మానిస్తున్న సిపిఎం నాయకులు

డీఎస్సీ ర్యాంకర్‌కు సిపిఎం సన్మానం

ప్రజాశక్తి-పుట్లూరు

ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో ఉపాధ్యాయ పోస్టుకు ఎంపికైన మండలంలోని కడవకల్లు గ్రామానికి చెందిన బండెల నాగార్జునను సిపిఎం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. దళిత కుటుంబానికి చెందిన నాగార్జున తండ్రి చిన్నప్పుడే చనిపోయాడు. దీంతో తల్లి ముగ్గురు బిడ్డలను రెక్కల కష్టంతో పోషించింది. వీరిలో నాగార్జున టీచర్ పోస్టు కొట్టి తల్లి కష్టానికి గౌరవం నిలబెట్టారు. విషయం తెలుసుకున్న సిపిఎం మండల కార్యదర్శి సూరి ఆధ్వర్యంలో నాగార్జునకు పూలమాల వేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు టి.పెద్దయ్య, బి.భాస్కర్‌రెడ్డి, కెవిపిఎస్ నాగభూషణ్, జె.పెద్దయ్య, కుళ్లాయప్ప, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ మహిళలకు ఉచిత శిక్షణ

అనంతపురం : గ్రామీణ ప్రాంత నిరుద్యోగ మహిళలకు టైలరింగ్, ఎంబ్రాయిడరీ వర్క్ (జరీ), ఫొటోగ్రఫీలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు రూడ్‌సెట్ డైరెక్టర్ ఎస్.విజయలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 10, 15, 16వతేదీల్లో ఆయా బ్యాచ్‌లకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణతోపాటు ఉచిత వసతి, భోజనం సౌకర్యం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. 19 నుంచి 45ఏళ్లలోపు ఉండి చదవడం, రాయడం వచ్చినవారు అర్హులు అన్నారు. ఆసక్తి ఉన్న వారు సెల్..96188 76060, 94925 83484 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

సమస్యల వలయంలో ఇందిరమ్మ కాలనీ

స్తంభాలు పూడ్చారు..కనెక్షన్లు మరిచారు..-చినుకు పడితే చిత్తడే- ఇబ్బందుల్లో ప్రజలు

ప్రజాశక్తి, నార్పల

మండల కేంద్రంలోని సుల్తాన్‌పేట ఇందిరమ్మ కాలనీ సమస్యల వలయంలో చిక్కుకుని విలవిలలాడుతోంది. ఓ వైపు కరెంటు లేకపోగా.. మరోవైపు నడిచేందుకు రోడ్లు కూడా వేయకపోవడంతో కాలనీవాలసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇందిరమ్మ కాలనీలో సుమారు 100 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ప్రభుత్వం ఉచితంగా స్థలాలు ఇవ్వడంతో చాలామంది ఇళ్లు నిర్మించుకుని నిర్మించుకున్నారు. అయితే ఇళ్లు నిర్మించుకుని సంవత్సరాలు గడుస్తున్నా పూర్తిస్థాయిలో మౌలిక సౌకర్యాలు కల్పించకపోవడం గమనార్హం. గత ప్రభుత్వంలో విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడానికి, వీధిలైట్లు వేయడానికి స్తంభాలు పూడ్చారు. అయితే కనెక్షన్లు మాత్రం ఇవ్వలేదు. కేవలం ఒక్క విద్యుత్ స్తంభానికే కాలనీలోని అందరి విద్యుత్ కలెక్షన్లు ఇచ్చారు. దీంతో ఏ ఇంట్లో విద్యుత్ సమస్య వచ్చినా అన్ని ఇళ్లకూ విద్యుత్ సరఫరా నిలిచిపోతోందని స్థానికులు వాపోతున్నారు. ఇక వీధిలైట్లు లేకపోవడంతో రాత్రి సమయంలో బిక్కుబిక్కుమంటూ గడపాల్సి వస్తోందని అంటున్నారు. చీకటిలో విష కీటకాలు సంచరిస్తున్నాయని చెబుతున్నారు దీనికి తోడు ఒకటి రెండు సందుల్లో సిసి రోడ్లు వేసి మిగిలిన వాటిని అలాగే వదిలేశారు. దీంతో చిన్నపాటి చినుకు పడితే మొత్తం చిత్తడి చిత్తడిగా మారి నడవడానికి కూడా ఇబ్బందిగా ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి సుల్తాన్ ఇందిరమ్మ కాలనీలో కనీస మౌలిక వసతులు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై స్థానిక విద్యుత్ ఎఇ నీలకంఠను ప్రజాశక్తి వివరణ కోరగా సంబంధిత ఏరియా లైన్‌మెన్‌తో వివరాలు సేకరిస్తానన్నారు. అంతేగాకుండా త్వరలోనే ఆ ప్రాంతాన్ని సందర్శించి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు.

సీసీ రోడ్డు లేని వీధి

విద్యుత్ కనెక్షన్ లేని స్తంభాలు

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలు

ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఎన్‌టిఎ కూటమి చేస్తున్న ఫాసిస్ట్ పాలన, లేబర్ కోడ్‌లు, ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కార్మిక చట్టాల అమలు, కార్మికుల ఉద్యోగ భద్రత, ఉపాధి భద్రత కోసం పోరాటాలు చేయాలని ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. నగరంలోని పెన్షనర్స్ భవన్‌లో ఆదివారం రెండో రోజు రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తరంగాల్లోకి ఐఎఫ్‌టియు విస్తరించాలన్నారు. ఇందుకు కార్యకర్తలు, శ్రేణులకు కార్మికవర్గ చైతన్యాన్ని అందించి, వారి తక్షణ, దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి, అంతిమంగా సమ సమాజ నిర్మాణం కోసం ప్రజాస్వామిక విప్లవ సాధనకు సిద్ధం కావాలన్నారు. ఈ సమావేశంలో ఐఎఫ్‌టియు జిల్లా కమిటీ సభ్యులు రఘునాథరెడ్డి, జిలాన్, రామిరెడ్డి, రామాంజనేయులు, సురేష్, జిల్లా అధ్యక్షులు ఏసురత్నం, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సురేష్, జిల్లా కమిటీ సభ్యులు మారుతి, నగర అధ్యక్షులు దావీద్, ఉపాధ్యక్షులు నాగరాజు కమిటీ సభ్యులు మాబు, నర్సప్ప, నాగభూషణం, లింగమయ్య, బాలు పాల్గొన్నారు.

నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని కలెక్టరేట్‌లో ఉన్న రెవెన్యూ భవన్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ ప్రజల నుంచి వినతులను స్వీకరించనున్నట్లు తెలిపారు. అర్జీదారులు ఒకవేళ గతంలో అర్జీలు సమర్పించి ఉంటే అందుకు సంబంధించిన స్లిప్పులను తీసుకురావాలని కోరారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్‌కి మెసేజ్ వస్తుందని, అర్జీదారులు వారి ఫోన్‌ను చెక్ చేసుకోవాలన్నారు.

1100 సేవలను వినియోగించుకోండి

మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని కలెక్టర్ తెలిపారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి Meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో అర్జీలు నమోదు చేసుకోవచ్చున్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎపిటిఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఎపిటిఎఫ్ శింగనమల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాయల్ వెంకటేష్, ఎస్‌సి రాజుద్దీన్ తెలిపారు. అధ్యక్షులుగా శ్రీనివాసమూర్తి, ప్రధాన కార్యదర్శిగా రామమూర్తి మరొక్కసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దీంతో జిల్లా నాయకులు వారికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి బి.నర్సింహులు, ఎన్నికల అధికారులు వెంకటరమణ, అంజలిదేవి, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ వన్నప్ప, సీనియర్ నాయకులు సూర్యనారాయణ, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిని సన్మానిస్తున్న నాయకులు

వృద్ధుల ఇంటివద్దకే రేషన్...

చక్కెర ప్యాకెట్ అందజేస్తున్న డీలర్

ఉరవకొండ : రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు వృద్ధులు, వికలాంగుల ఇళ్ల వద్దకే వెళ్లి రేషన్ డీలర్లు రేషన్ పంపిణీ చేశారు. ఇందులో భాగంగా ఉరవకొండ మండల పరిధిలోని నింబగల్లు గ్రామంలో 1215030 నంబర్ చౌకధాన్యం డిపో డీలర్ ఎం.గోపాల్ తన స్టోర్ పరిధిలో ఉన్న 20 మంది వృద్ధులు, వికలాంగుల ఇళ్ల వద్దకు ఆదివారం ఉదయం వెళ్లి రేషన్‌తోపాటు చక్కెర, జొన్నలు, తదితర వాటన్నిటిని పంపిణీ చేశారు.

కారుణ్య నియామకాలు చేపట్టాలి

ప్రజాశక్తి-గుంతకల్లు

ఆప్కాస్ విధానంలో పారిశుధ్య కార్మికులుగా పని చేస్తూ మరణించిన, పదవీ విరమణ పొందిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని సిఐటియు, ఎఐటియుసి అనుబంధ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు వీరభద్రస్వామి, కె.నరసయ్య డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక హంపిరెడ్డి భవనంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ 2022లో ఆరుగురు ఆప్కాస్ వర్కర్లు రిటైర్డ్, మరణించిన వారి సంతతిని విధుల్లోకి తీసుకున్నారన్నారు. వారికి నియామక ఉత్తర్వులు కూడా ఛైర్‌పర్సన్ భవాని ఇచ్చారన్నారు. అనంతరం 13 మంది పారిశుధ్య కార్మికులు ఐదుగురు మరణించారని, మరో ఎనిమిది మంది రిటైర్డ్ అయ్యారన్నారు. కారుణ్య నియామకాలు చేపట్టాలని ఇప్పటికే అనేకమార్లు నాయకులు, అధికారులకు వినతిపత్రాలు అందజేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా కమిషనర్ స్పందించకపోతే భవిష్యత్తులో కలిసి వచ్చే ట్రేడ్ యూనియన్లు, కులసంఘాలు,రాజకీయ పార్టీ నాయకులను కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు జగదీష్, రంగనాయుడు, శామ్యూల్, ప్రేమ్‌కుమార్, ఎఐటియుసి నాయకులు చిన్న కొండయ్య, వాసు, వెంకటేశు, పెద్ద పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న సిఐటియు, ఎఐటియుసి నాయకులు

15న లేబర్ కమిషనర్ కార్యాలయం ముట్టడి

ప్రజాశక్తి-శింగనమల

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియు భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈనెల 15వతేదీన లేబర్ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు భవన నిర్మాణ కార్మికుల జిల్లా కార్యదర్శి మనీలా రామాంజనేయులు తెలిపారు. ఈమేరకు ఆదివారం మండల కేంద్రంలో ఇందుకు సంబంధించిన గోడపత్రికలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి నాయకులు కార్మికులకు ఎన్నికలముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో 25 లక్షలపైగా భవన నిర్మాణ కార్మికులు పని చేస్తున్నారన్నారు. అయితే కేవలం 18 లక్షలపైగా మాత్రమే రాష్ట్ర బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డులో పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. అనేక రాష్ట్రాల్లో భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. అయితే మన రాష్ట్రంలో మాత్రం అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. వెంటనే భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్, నాయకులు రామాంజనేయులు, నాగరాజు, కుళ్లాయప్ప, లక్ష్మీదేవి, మునెప్ప, నల్లప్ప, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లను విడుదల చేస్తున్న భవన నిర్మాణ సంఘం నాయకులు

మహాసభలు జయప్రదం చేయండి

ఎపి రైతు సంఘం సీనియర్ నాయకుడు అనిమిరెడ్డి

ప్రజాశక్తి-పామిడి

ఈనెల 8వతేదీన ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలో గుత్తి రోడ్డులోని అంబేద్కర్ భవనంలో నిర్వహించనున్న మండల మహాసభలను జయప్రదం చేయాలని రైతు సంఘం సీనియర్ నాయకుడు అనిమిరెడ్డి, మండల కార్యదర్శి ముత్యాలు పిలుపునిచ్చారు. ఈమేరకు మంగళవారం మండలంలోని ఖాదర్‌పేట, అనుంపల్లి గ్రామాల్లో రైతుసంఘం నాయకులు పర్యటించి సభ్యత్వాలు సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో అనావృష్టి కారణాల వల్ల వరుసగా 8ఏళ్లుగా పంటలు సరిగా పండటం లేదన్నారు. అరకొర పండిన పంటలకు గిట్టుబాటు ధరలు ఉండటం లేదన్నారు. ముఖ్యంగా కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తీసుకొచ్చిన వ్యవసాయ చట్టాలతో రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఏర్పడిందన్నారు. వెంటనే నల్లచట్టాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలపై చర్చించేందుకు ఈనెల 8వతేదీన నిర్వహించనున్న మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మల్లేష్, ఈశ్వరయ్య, షాసు, తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు చేస్తున్న ఎపి రైతుసంఘం నాయకులు

ఘనంగా వినాయక నిమజ్జనం

ప్రజాశక్తి-రాయదుర్గం

వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటైన వినాయక ప్రతిమలను ఆదివారం నిమజ్జనానికి తరలించారు. ఇందులో భాగంగా ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై ప్రతిమలను ఉంచి పట్టణ వీధుల్లో ఊరేగించారు. అంతకుముందు లడ్డులకు వేలంపాటలు వేశారు. తర్వాత పట్టణ పొలిమేరలోని చెక్‌పోస్టు వద్ద నాయునిచెరువు, కణేకల్లు వద్ద ఉన్న చిక్కణ్ణేశ్వర వడయార్ చెరువులో వినాయక ప్రతిమలను నిమజ్జనం చేశారు.

నార్పల : మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఆదివారం వినాయక నిమజ్జన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేళతాలాలు, డప్పు వాయిద్యాల నడుమ వినాయక ప్రతిమలను ఊరేగించారు. అనంతరం నిమజ్జనం చేశారు.

ఉరవకొండ : విడపనకల్లు మండలం గడేకల్ గ్రామంలో శ్రీరామలింగేశ్వర దేవస్థానం, పెద్దమ్మ అవ్వ ఆలయాల్లో కొలువైన గణనాథుల నిమజ్జనోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. వీరశైవ లింగాయతులు ఆధ్వర్యంలో భక్తిగీతాలతో నిర్వహించిన భజన కార్యక్రమం గణనాథుని శోభాయాత్ర ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అదేవిధంగా వాల్మీకుల ఆధ్వర్యంలో గణనాథుని వీడ్కోలులో భాగంగా ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. ఉట్టికొట్టేందుకు యువత పోటీపడుతూ ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఉరవకొండలో నిమజ్జనానికి తరలుతున్న వినాయకుడు

మహిళా సంఘం మండల కమిటీ ఎన్నిక

జెండాను ఎగురవేస్తున్న మహిళలు

ఆత్మకూరు : మండల కేంద్రంలోని భగత్‌సింగ్ కాలనీలో మహిళా సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చంద్రకళ అధ్యక్షతన ఆదివారం మండల మహిళా సంఘం నూతన కమిటీ ఏకాగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా రాజేశ్వరమ్మ, అధ్యక్షురాలిగా కృష్ణవేణి, సహాయ కార్యదర్శిగా గంగమ్మ, గౌరవాధ్యక్షురాలిగా ఎర్రమ్మతోపాటు 10మందిని సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం మహిళా సంఘం జిల్లా అధ్యక్షులు రామాంజినమ్మ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా గ్రామ కమిటీలు వేసి బలోపేతం చేయాలన్నారు.

నేడు 'రీకాలింగ్ చంద్రబాబు'

కళ్యాణదుర్గం టౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని ఒంటిమిద్ది గ్రామంలో సోమవారం రీకాలింగ్ చంద్రబాబు మ్యానిఫెస్టో కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైసిపి పట్టణ, రూరల్ కన్వీనర్లు సుధీర్, గోళ్ల సూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వైసిపి సమన్వయకర్త తలారి రంగయ్య ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి వైసిపి జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, పరిశీలకులు నరేష్‌రెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు. కావున నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పుట్లూరు : వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సాకే శైలజనాథ్ ఆదేశాల మేరకు సోమవారం మండల కేంద్రంలో 'రీ కాలింగ్ చంద్రబాబుస్ మేనిఫెస్టో' కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ పొన్నపాటి మహేశ్వర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున వైసిపి మండల నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు.

వైసిపి నేత దొణస్వామి మృతికి నివాళి

కళ్యాణదుర్గంరూరల్ : మండలంలోని గూబనపల్లి గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు బి.దొణస్వామి మృతికి పలువురు నాయకులు నివాళులర్పించారు. అనారోగ్యంతో బాధపడుతున్న దొణస్వామి ఆదివారం కన్నుమూశారు. విషయం తెలుసుకున్న వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య గ్రామానికి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో ఎంపిపిలు, జడ్పిటిసిలు, మండల కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

నివాళులర్పిస్తున్న తలారి రంగయ్య

వినాయకుని లడ్డూ వేలం రూ.2.01 లక్షలు

లడ్డును వేలం వేస్తున్న నిర్వాహకులు

కళ్యాణదుర్గం టౌన్ : వినాయక ఉత్సవాల్లో భాగంగా స్థానిక పాత కాయగూరల మార్కెట్‌లో టీమ్ ఉత్సవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమ వద్ద ఆదివారం లడ్డూ వేలంపాట నిర్వహించారు. 44 కిలోల లడ్డును లెజెండ్ టీమ్ సభ్యులు రూ.2.01 లక్షలకు దక్కించుకున్నారు. చిన్నలడ్డును వరుణ్ అనే వ్యక్తి రూ.50వేలకు దక్కించుకున్నారు. అదేవిధంగా వినాయకునికి సమర్పించిన గజహారాన్ని వేలం నిర్వహించగా ప్రేమ్ ఫొటో స్టూడియో నిర్వహకుడు రూ.27వేలకు దక్కించుకున్నాడు.

తాగునీటి ట్యాంకు ఏర్పాటు

పుట్లూరు : మండల కేంద్రంలోని కోటవీధిలో పుట్లూరుకు చెందిన పుల్లారెడ్డి 1500 లీటర్ల ట్యాంకును ఉచితంగా అందజేశారు. మండల కేంద్రంలో తాగునీటి సమస్య ఉందని స్థానికులు పల్లారెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. ఇందుకు స్పందించిన ఆయన రూ.25వేల విలువజేసే నీటిట్యాంకును ఏర్పాటు చేసి కోట వీధి నుంచి పెద్దమ్మ గుడి వరకూ పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. దీంతో పుల్లారెడ్డికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

ట్యాంకు నుంచి నీరు పట్టుకుంటున్న స్థానికులు

నేరాలు ఘోరాలు

వ్యక్తి ఆత్మహత్య

శ్రీకాంత్ (పాతచిత్రం)

కళ్యాణదుర్గం రూరల్ : కళ్యాణదుర్గం పట్టణ ప్రజలకు ఎంతో సుపరిచితుడు అయిన మఠం శ్రీకాంత్ (52) ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శ్రీకాంత్ తల్లిదండ్రులు వృధాప్య రిత్యా ఇటీవల కాలం చెందారు. ఈనేపథ్యంలో ఇంటి పెద్దదిక్కులను కోల్పోయిన శ్రీకాంత్ ఒంటరిగా ఇబ్బంది పడేవాడని స్థానికులు చెబుతున్నారు. దీంతో మానసిక వేదనకు గురై ఇంట్లో ఎవరూ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. దీంతో భార్య, కొడుకు, కుమార్తె కన్నీరు మున్నీరుగా విలపించారు. 'ఏ కష్టం వచ్చింది రా నీకు' అంటూ స్నేహితులు సోషల్ మీడియాలో ఆవేదన చెందారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఆలయంలో చోరీ

గుత్తి : మండల పరిధిలోని ఇసురాళ్లపల్లి గ్రామంలో ఉన్న రాఘవేంద్ర స్వామి ఆలయంలో శనివారం రాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని దుండగులు ఆలయంలోకి చొరబడి అక్కడ ఉన్న నాలుగు హుండీలను పగుల కొట్టి అందులో ఉన్న దాదాపు రూ.30 వేలు నగదును దోచుకెళ్ళారు. ఘటనపై ఆలయ అర్చకుడు నరసింహచారి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో వ్యాపారవేత్త దుర్మరణం

ప్రజాశక్తి-పెనుకొండ

మండలంలోని గుట్టూరు గ్రామ సమీపంలో 44వ జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యాపారవేత్త మృతి చెందాడు. కియా ఇండస్ట్రియల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ రాజేష్ తెలిపిన వివరాలు.. అనంతపురం నగరంలోని 1వ రోడ్డులో నివాసం ఉంటున్న కిసాన్ కింగ్ ఆగ్రో ప్రైవేట్ లిమిటెడ్ ఎండి గొల్ల అంజన్‌కుమార్(34) వ్యాపార నిమిత్తం కారులో బెంగళూరు వెళ్లాడు. అక్కడి నుంచి ఆదివారం ఉదయం అనంతపురానికి తిరుగు పయాణమయ్యాడు. మార్గం మధ్యలో గుట్టూరు గ్రామ సమీపంలోకి రాగానే కారు టైరు పేలి హైవే పక్కన రక్షణగా ఏర్పాటు చేసిన ఇనుప యాంగలర్‌ను వేగంగా ఢీకొన్నాడు. దీంతో ఇనుప యాంగలర్ కారు ముందు భాగం నుంచి దూసుకెళ్లి అంజన్ కుమార్‌ను గుచ్చుకొని కారు వెనుక భాగంలోకి దూసుకెళ్లింది. గమనించిన స్థానికులు సమాచా రం ఇవ్వడంతో పోలీసు లు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కారు లోపల ఇరుక్కు పోయిన అంజన్‌కుమార్‌ను స్థానికుల సాయంతో బయటకు తీశారు. అయితే తీవ్రంగా గాయపడిన అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. అతడికి భార్య రాజ్యలక్ష్మి, ఓ కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ప్రమాదానికి గురైన కారు, అంజన్‌కుమార్(ఫైల్ ఫోటో)